నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
గురువారం | డిసెంబర్ 12, 2024 | www.navatelangana.com

గోండి విక్షనరీ ఆవిర్భావ దినోత్సవం

ఉట్నూర్: మండల కేంద్రంలోని రాజ్ గోండు సేవా సమితి భవనం గుస్సాడి గుట్టలో బుధవారం బోలి చేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోండి విక్షనరి ఆవిర్భావ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోలి చేతో ఫౌండేషన్ బోర్డు మెంబర్స్ సిడాం కిరణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో 30 లక్షలకుపైగా మాట్లాడే గోండి భాషలో విక్షనరీని రూపొందించడం చాలా గొప్ప విషయమన్నారు. దేశంలోని గిరిజన భాషలకు సరైన రక్షణ కల్పించి వాటిని కాపాడుకునేందుకు ప్రభుత్వాలు కృషి చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో బోలి చేతో ఫౌండేషన్ సభ్యులు ఆత్రం మోతీరామ్, సిడాం వరప్రసాద్, కొలాం విద్యార్థి సంఘం సభ్యులు ఆత్రం జ్యోతిరాం, మడావి రవి పాల్గొన్నారు.



విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఇంద్రవెల్లి : ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ అడిషనల్ డీఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. వంట గది, స్టోర్ రూంను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. కూరగాయలను కమిటీ నిర్ధారణ చేసిన తరువాతే వండాలన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ నాణ్యత కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రకాష్, వార్డెన్ అన్నపూర్ణ పాల్గొన్నారు.



అర్హులకు దక్కేనా..?

- ప్రారంభమైన ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ
- దరఖాస్తులు లక్షల్లో.. కేటాయింపు వేలల్లో
- ఎవరికి దక్కుతుందోనని లబ్దిదారుల్లో ఆందోళన
- ఈ నెల 20వరకు సర్వే పూర్తిచేయాలని ఆదేశాలు

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇండ్ల కేటాయింపు కోసం లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎవరికి దక్కుతాయోనని ఆందోళన కనిపిస్తోంది. ఇండ్ల కోసం దరఖాస్తులు చేసిన వారు లక్షల్లో ఉండటం.. ప్రభుత్వం మాత్రం వేలల్లో ఇండ్లు మంజూరుచేయడంతో ఇందులో అర్హులెవరు..? ఎవరిని పక్కన పెడుతారోనని తీవ్ర ఉత్కంఠ కలిగిస్తోంది. అనేక మంది ఏండ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తుండటం.. వీరి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించింది. కానీ లబ్దిదారుల ఎంపిక మాత్రం అటు ప్రభుత్వానికి..ఇటు అధికారులకు సవాల్‌గా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.నిబంధనల ప్రకారం అనేక మంది అర్హులు ఉండగా.. ఇందులో ఎవరికి మొదటి ప్రాధాన్యం ఇస్తుందనేదానిపై అందరిలో ఆసక్తి నెలకొంది.


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒకటి. ఇప్పటికే కొన్ని పథకాలు అమలవుతుండగా.. తాజాగా ఇండ్ల పథకాన్ని సైతం ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే కిందటేడాది డిసెంబర్ చివరి వారం నుంచి ఈ ఏడాది జనవరి మొదటి వారం వరకు ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు స్వీకరించగా.. వాటిని ప్రస్తుతం పరిశీలన చేపడుతున్నారు. అప్పట్లో ఇండ్ల కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షల్లో దరఖాస్తులు వచ్చాయి. ఆదిలాబాద్ జిల్లాలో 1,99,803 మంది, నిర్మల్ జిల్లాలో 1,93,647మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1,54,141మంది, మంచిర్యాల జిల్లాలో 2,10,216 మంది దరఖాస్తులు చేశారు. కానీ ప్రభుత్వం తొలి విడతలో నియోజకవర్గానికి 3500 చొప్పున ఉమ్మడి జిల్లాలో 35వేల ఇండ్లను మాత్రమే మంజూరుచేస్తోంది. దీంతో లక్షల్లో దరఖాస్తులు రాగా.. ఇండ్ల కేటాయింపు మాత్రం కేవలం వేలల్లో ఉండటంతో ఇవి ఎవరికి దక్కుతాయోనని తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. వాస్తవానికి గత పదేండ్లుగా ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేయడం లేదు. దీంతో వేలాది ఉమ్మడి కుటుంబాల నుంచి జంటలు విడిపోయి వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఇలాంటి వారు అనేక మంది గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. ప్రభుత్వం ఎప్పుడు ఇండ్లు మంజూరుచేస్తుందా.. తమకు ఎప్పుడు సొంతిళ్లు లభిస్తుందా అని ఆతృతగా ఎదురుచూశారు. కానీ ప్రస్తుతం వచ్చిన దరఖాస్తులు పరిశీలించగా.. తమకు దక్కుతుందా లేదా అనే ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఎంపిక ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఒక్కో గ్రామంలోనే వందల కుటుంబాలు..!

ప్రభుత్వం ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో పొందుపర్చిన దరఖాస్తుల ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అర్హుల ఎంపిక చేపట్టనున్నారు. కొన్ని చోట్ల ఈ ప్రక్రియ ప్రారంభం కాగా.. మరికొన్ని చోట్ల గురువారం నుంచి మొదలుకానున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా అర్హులైన లబ్దిదారుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇల్లు లేదంటే స్థలం వద్ద లబ్దిదారుల ఫోటోలు తీసి.. ఇంటి నెంబర్లు, రేషన్‌కార్డు వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో అనేక గ్రామాల్లో అర్హులు సైతం వందల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరు లబ్దిదారులను ఎంపిక చేసిన తర్వాత చివరి ఎంపిక కోసం సంబంధిత శాఖకు జాబితా పంపించనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. దీని ప్రకారం మండలాలు, గ్రామాల యూనిట్‌గా తీసుకొని లబ్దిదారుల ఎంపిక ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం ఇండ్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యంగా బీపీఎల్ కుటుంబం అయి ఉండటంతో పాటు సొంత స్థలం కలిగి ఉండాలి. నిరుపేదలై ఉండి దళిత, గిరిజన కుటుంబాలతో పాటు ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్యం ఇవ్వనుంది. కానీ ఒక గ్రామంలో సుమారు వెయ్యి జనాభా ఉంటే ..ఇందులో సుమారు 700వరకు కుటుంబాలు బీపీఎల్ పరిధిలో ఉన్నాయి. అనేక మంది ఇండ్లు లేని వారు ఉన్నారు. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీల్లోనూ సొంత స్థలం కలిగి ఉన్నప్పటికీ..అనేక మంది సొంతింటి నిర్మాణానికి నోచుకోని వారు అనేక మంది ఉన్నారు. ఈ క్రమంలో ఎవరికి తొలి ప్రాధాన్యంగా తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇందులోనూ రాజకీయ జోక్యం ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

లబ్దిదారుల ఎంపిక సర్వే ప్రారంభం : బసవేశ్వర్, జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు కోసం అర్హుల ఎంపిక కోసం గ్రామాలు, మున్సిపాలిటిలో సర్వే ప్రారంభమైంది. అర్హుల వివరాలను పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది యాప్‌లో నమోదు చేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తొలి విడత లబ్దిదారుల ఎంపిక జరుగుతుంది.

పత్తి కొనుగోలులో తేమ పద్ధతిని రద్దు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి కొనుగోలులో తేమ పద్ధతిని రద్దు చేయాలని, వ్యవసాయ మార్కెట్‌లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు డిమాండ్ చేశారు. బుధవారం అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి పార్టీ ఆధ్వర్యంలో మార్కెట్‌ల సందర్శన సందర్భంగా వెలుగులోకి వచ్చిన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిలాబాద్ ప్రాంతంలో చాలా రకాల పంటలు పండించడానికి అనుకూల పరిస్థితిలున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం రైతులకు అందటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు పత్తికి రూ.7521, సోయాకు రూ.4892 తేమ పేరిట తగ్గించకుండా ఇవ్వాలని, తేమ పద్ధతిని రద్దు చేయాలని, పత్తి క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జైనథ్ మార్కెట్ యార్డ్‌లో పత్తి కొనుగోలు ప్రారంభించాలని, ఆదిలాబాద్, జైనథ్, బేల సబ్ మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మార్కెట్‌లలో రైతులకు తాగు నీరు, క్యాంటిన్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని, సీసీఐకి వచ్చే లాభాలను రైతులకు బోనస్‌గా ఇవ్వాలని, రైతుల ఆత్మహత్యలు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.ఆశన్న, ఎం.గంగారాం, బి.గంగారాం ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట భోజన కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్వాడీలకు అందిస్తున్న మాదిరి మధ్యాహ్న భోజన కార్మికులకు సరుకులను ప్రభుత్వమే పంపిణీ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు అన్నారు. బుధవారం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెండింగ్ వేతనాలతో పాటు కోడి గుడ్ల బిల్లులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ 20 ఏండ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెడుతున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అరకొర నిధులిచ్చి పౌష్టికాహారం పెట్టాలంటే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. బహిరంగ మార్కెట్‌లో గుడ్డు రూ.7 వస్తుందని, కానీ ప్రభుత్వం రూ.5.50 ఇస్తుందన్నారు. అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్‌రెడ్డి కార్మికులకు రూ.10వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, హామీకి అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. పెండింగ్ బిల్లులు, వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహిస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మీ, రాంబాయి, శ్రీదేవి, చంద్రకళ, సుజాత, గంగామణి, పుష్పలత ఉన్నారు.

గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడికిసన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ శాఖ ఏఓ శివకుమార్‌ను ధర్మ సమాజ్ పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారికి కష్టనష్టాల్లో అండగా ఉండాలని కోరారు. ప్రజా సమస్యలు, సామాజిక విలువలను కాపాడేలా నిరంతరం చైతన్య పర్చాలని అన్నారు. ఇందులో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెలా లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్, నాయకులు సీటీ వెంకటేష్, బడుగు రాజేశ్వర్, తుంటికూరి సంతోష్, గొంటి ముక్కుల ఓమన్న, బండారి సంతోష్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.51వేల విరాళం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని పద్మావతి కాలనీలో నూతనంగా రామ మందిర నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం బోర్ వెల్ భూమి పూజ కార్యక్రమం నిర్వహించగా ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి రూ.51 వేలను విరాళంగా అందజేశారు. అనంతరం కాలనీవాసులు ఖండేష్కర్ దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు బుర్రి వేణు, పుష్కర్ రామేష్వర్, ఆలయ కమిటీ సభ్యులు చాటే బాలాజీ, రుక్మారెడ్డి, సత్యం, తిరుపతి, సంజీవ్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మనుబోతు మృతి

నవతెలంగాణ- నిర్మల్‌రూరల్



దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్-న్యూలోలం గ్రామాల మధ్య కాల్వ అడవిలో 61వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మనుబోతు(సాంబారు) మృతి చెందింది. మనుబోతు వేగంగా రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదానికి గురై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు స్థానికులు తెలిపారు.

గ్రూప్-2కు నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గ్రూప్-2 పరీక్షలు రాసే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాలకు అనుమతి లేదని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో ఈ నెల 15,16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, రూట్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలు నిర్వహించేందుకు 29 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అర్బన్ పరిధిలో 14, రూరల్‌లో 04, మావలలో 10, జైనథ్‌లో 01 మొత్తం 29 పరీక్ష కేంద్రాలలో 10,428 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్‌లు, శాఖాపరమైన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేయడం జరుగుతుందని, పరీక్ష పత్రాల బందోబస్తు, పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ ఏర్పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో స్క్రైబ్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రెండు రోజులపాటు ఉదయం 10 గంటల నుండి 12. 30 వరకు, మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5.30 వరకు నాలుగు దఫాలుగా పరీక్షలు జరుగుతాయని, పరీక్ష కేంద్రంలోకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్స్ ఎలక్ట్రానిక్స్ వస్తువులతో పరీక్ష కేంద్రాలకు రాకూడదని, పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అదనపు ఎస్పీ సురేందర్, ట్రైనీ కలెక్టర్ అబిగ్యాన్ మాలవీయ, డీఎస్పీ జీవన్‌రెడ్డి, రీజనల్ కో-ఆర్డినేటర్ జగ్రాం అంతర్వేది, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : గ్రూప్-2 పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, లోకల్ రూట్ ఆఫీసర్ లు, జాయింట్ రూట్ ఆఫీసర్‌లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రూప్-2 పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ నెల 15, 16న నిర్వహించనున్న పరీక్షలకు జిల్లాలో 8080 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందుకు పట్టణంలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీరు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష పత్రాల రవాణా భద్రతపై పర్యవేక్షణ చేయాలన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన తర్వాతనే కేంద్రంలోకి అనుమతించాలన్నారు. అనంతరం గ్రూప్-2 నిర్వహణలో తీసుకోవలసిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ పీజి రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, రూట్ అధికారులు పాల్గొన్నారు.



కేరళ ప్రభుత్వాన్ని దెబ్బ తీయడానికి కేంద్రం కుట్రలు

- వృకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు
- కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలో ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న కేరళ ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి కేంద్రం కుట్రలు చేస్తోందని, దానికి కాంగ్రెస్ పార్టీ కూడా సహకారం అందిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘువులు అన్నారు. కేరళపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తు సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక, టీఏజీఎస్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లంక రాఘువులు మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పిస్తు దేశంలోనే కేరళలో ఆదర్శ పాలన అందిస్తోందన్నారు. దీన్ని ఓర్వలేక కేంద్రంలోని బీజేపీ ఆ ప్రభుత్వంపై విమర్శలు, అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. దీనికి కాంగ్రెస్ పార్టీ కూడా సహకరించడం సరైంది కాదన్నారు. విదేశాలకు ఎగుమతులు చేయడంలో, చదవు, కరోనా సమయం, వరదల సమయంలో ప్రజలను ఆదుకుంటూ నిలదొక్కుకుందన్నారు. కానీ కేంద్రం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయడం నీతిమాలిన చర్య అన్నారు. కేరళను కాపాడుకోవడం అందరి బాధ్యత అని, అందులో భాగంగానే నిరసన చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, రవీందర్, ఆశన్న, మంజుల, సురేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో రెండు న్యూరో ఆపరేషన్‌లు సక్సెస్

- వైద్య సేవలు వినియోగించుకోవాలి : డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు అరుదైన ఆపరేషన్లను చేస్తున్నామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఇటీవల న్యూరోకు సంబంధించి రెండు ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేయడంతో బుధవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను తెలియజేశారు. రిమ్స్‌లో పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రయివేట్‌లో పెద్ద ఖర్చుతో కూడుకున్న ఆపరేషన్లను వైద్యులు ఇక్కడ చేస్తున్నారన్నారు. న్యూరోకు సంబంధించి డాక్టర్ విజయ్ మోహన్ రెండు ఆపరేషన్లు చేశారని, రోగులు ప్రస్తుతం బాగున్నారని తెలిపారు. రిమ్స్‌కు వచ్చే రోగి సహాయకులు కొన్ని సూచనలు పాటించాలన్నారు. రిమ్స్‌ను తమ ఆస్పత్రిగా భావించి పరిశుభ్రతకు సహకరించాలన్నారు. ఇక రోగితో పాటు సహాయకుడికి పాస్ ఇస్తామని, ఇతర వారికి అనుమతి ఉండదన్నారు. రోగిని చూడడానికి మధ్యాహ్నం 12 నుంచి 1 గంట, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సమయం ఇస్తున్నామన్నారు. రిమ్స్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా ప్రత్యేక చర్యల సిబ్బందిని కూడా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

కోలుకున్న రోగులు త్వరలో డిశ్చార్జ్

న్యూరో వైద్యుడు విజయ్‌మోహన్ రాజు మాట్లాడుతూ పట్టణానికి చెందిన సతీష్ నడుము, కాళ్లు తిమ్మిర్లతో బాధపడుతూ రిమ్స్‌లో చేరారని తెలిపారు. అదే విధంగా ఈ నెల 2న తలమడుగు మండలం పల్సి(కె)కు చెందిన లక్ష్మీ తలకు గాయం కారణంగా రిమ్స్‌లో చేరారని తెలిపారు. వీరిని పరీక్షించి స్కానింగ్ తీసి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం రోగులు కోలుకుంటున్నారని, త్వరలోనే వారిని డిశ్చార్జి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అశోక్, ఆర్ఎంఓ చంపత్‌రావ్, న్యూరో వైద్య సిబ్బంది ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చదువుతో పాటు విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని డీఈఓ ప్రణీత అన్నారు. బుధవారం సీఎం కప్ అర్బన్ పోటీలను ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. దీనికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభించారు. అనంతరం కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రణీత మాట్లాడుతూ విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో పోటీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ, మండల, పట్టణ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతున్నాయన్నారు. పట్టణ స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడినా కుంగిపోకుండా మరింత ఉత్సహంతో కష్టపడి క్రీడా స్ఫూర్తి చాటేలా పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఎంఈఓ సోమయ్య, మున్సిపల్ ఆర్ వెంకటేష్, ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
గురువారం | డిసెంబర్ 12, 2024 | www.navatelangana.com

ఉద్యోగోన్నతి పొందిన అధికారికి సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్



విద్యుత్ శాఖలో ఎస్ఈగా విధులు నిర్వహించి చీఫ్ ఇంజనర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న జేఆర్ చౌహాన్‌ను లంబాడా జేఏసీ నాయకులు బుధవారం ఆదిలాబాద్‌లోని తన నివాసంలో శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నతికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లంబాడా జేఏసీ నాయకులు గోపాల్ రావ్, నేతావత్ రాందాస్, రాథోడ్ బాబులాల్, బానోత్ జగన్ నాయక్ ,ప్రధాన కార్యదర్శి, సలహాదారులు రాథోడ్ పరశురామ్, రాథోడ్ సుధాకర్ నాయక్, మహేందర్ రాథోడ్, జాదవ్ ప్రకాష్ నాయక్ పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉంచాలి

నవతెలంగాణ-నార్నూర్



కార్యాలయంలోని రికార్డులను సక్రమంగా ఉంచాలని సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి బర్త్ సర్టిఫికేట్, భూ తదితర రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా ఎస్ఆర్ జిన్నింగ్‌లో సీసీఐ పత్తి కొనుగోళు కేంద్రాన్ని పరిశీలించారు. తేమ శాతం ఆరా తీసి మైచర్ తీరుపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ రాజలింగం, జిన్నింగ్, సీసీఐ సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-బోథ్

వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ యార్డు అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తుందన్నారు. అలాగే మార్కెట్‌లోని నూతన గోడం నిర్మాణంతో పాటు అభివృద్ధి పనులకు పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఆడే వసంత్ రావు, మార్కెట్ కార్యదర్శి విఠల్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉట్నూర్

మానవ హక్కుల వేదిక అనంతపురంలో నిర్వహించే 10వ రాష్ట్ర మహాసభల కరపత్రాలను బుధవారం ప్రెస్ భవన్‌లో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి ఒకే విలువ కోసం మానవ హక్కుల వేదిక వృషి చేస్తుందన్నారు. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను కాలరాస్తూ ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. రెండు తెలుగు రాష్ట్రాల 10వ మాహాసభలను ఈనెల 14, 15 తేదీలలో నిర్వహించే ఈ సభలకు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్, ప్రజా సంఘాల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బానోత్ రామారావు, మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి కాంబ్లే ప్రజ్ఞశీల్, విద్యార్థి సంఘం నాయకులు జాడి వెంకటేష్, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు జంగాదేవ్ పటేల్, మంగం దీపక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివినప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని సెక్టోరియల్ అధికారి జే.నారాయణ పదవ తరగతి విద్యార్థులకు సూచించారు. రూరల్ మండలంలోని లాంగసాంగి ప్రాథమిక, ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేయడంతో పాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యసన స్థాయి పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని మధ్యాహ్నం భోజన నిర్వాహకులకు సూచించారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జర్నలిస్ట్ లపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబు పై చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆదిలాబాద్ లోని ఎన్టీఆర్ చౌక్ లో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు. జర్నలిస్ట్ లపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ నూకల దేవేందర్ మాట్లాడుతూ జర్నలిస్ట్ లపై దాడులు జరుగుతుడటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వార్త కవరేజ్ కోసం వెళ్లిన జర్నలిస్ట్ లపై మోహన్ బాబు దురుసుగా ప్రవర్తిస్తూ భౌతిక దాడికి దిగడం శోచనీయమన్నారు. వెంటనే మోహన్ బాబు పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో వివిధ సంఘాల ప్రతినిధులు, జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

బోథ్ :జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలని బుధవారం తహసీల్దార్ సుభాష్ చంద్రను జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ బాబు మోహన్ ఇంట్లో జరుగుతున్న వివాదాలను కవరేజ్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోథ్ ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్టూడెంట్ ఛాంపియన్‌గా తయారు చేయాలి

- కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రతి ఒక్క విద్యార్థినీ స్టూడెంట్ ఛాంపియన్‌గా తయారు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో శ్రీకారం చుట్టిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని, నవంబర్ 14న ప్రారంభించి నాలుగు వారాల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమంలో దీనిద్వారా విద్యార్థుల్లో మంచి మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. బుధవారం వైద్యాధికారి కార్యాలయంలో కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, అధికారులు, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో మొదటగా వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఒత్తిడి నివారణ, మాదక ద్రవ్యాలు, సీజనల్ వ్యాధులపై విద్యార్థుల్లో మంచి అవగాహన కలిగి మంచి మార్పులు జరిగాయన్నారు. ఈ క్రమంలో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించి, ప్రతీ వారం ఒక్కొక్క సబ్జెక్టు వారిగా కండ్లు వాటి సంరక్షణ, మంచి నిద్రతో కండ్లకు విశ్రాంతి, నిర్దిష్ట పరిస్థితుల్లో జాగ్రత్తలు, పిల్లల్లో సాధారణ కంటి సమస్యలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ పాఠశాలలో 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు కమ్యునికేషన్ నైపుణ్యాలు, పిల్లల విశ్వాసం, ఇంటర్నెట్ భద్రత, ప్రాముఖ్యత, ఇంటర్నెట్ వ్యసనం, అధిగమించే వ్యూహాలు, రీల్ లైఫ్, రియల్ లైఫ్, తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, ప్రతి ఒక్క విద్యార్థినీ స్టూడెంట్ చాంపియన్‌గా తయారు చేయాలన్నారు. వారిలో ఉన్న టాలెంట్‌ను వెలికి తీయాలన్నారు. అలాగే ప్రతి పాఠశాలల్లో యోగ చివరి పిరియడ్‌లో యోగ నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులతో పాటు పీఈటీలు కూడా పాల్గొనాలని, విద్యార్థులు సరిగా నేర్చుకుంటున్నారా లేదా పర్యవేక్షించాలన్నారు. 10వ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన అభ్యాస దీపికలు సద్వినియోగ చేసుకునేలా అధ్యాపకులు చూడాలని, విద్యార్థులు మంచి అలవాట్లు మెరుగు పరుచుకొని, ఆదర్శంగా నిలిచేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఆదేశించారు. ఇంకా నాలుగు వారాల పాటు దీనిని పొడగించి, మార్పులు చేర్పులు చేసి మరికొన్ని కొత్త ఆరు సూత్రాలను రూపొందించి విద్యార్థుల్లో ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి రూపొందించడం జరిగిందని తెలిపారు.

సరిహద్దు ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-తాంసి

మహారాష్ట్ర సరిహద్దు ప్రాంత పరిసరాల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకుని ముందస్తు సమాచారాన్ని రాబట్టాలని ఎస్పీ గౌస్ ఆలం పోలీస్ సిబ్బందికి సూచించారు. బుధవారం భీంపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు, రిసెప్షన్, పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బంది డ్రిల్, కిట్లను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి గౌరవ వందనం అందించారు. అనంతరం స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు. స్క్వాడ్ డ్రిల్లును తీసుకొని వారి కవాతును పరిశీలించారు. నమోదైన ప్రతి ఒక్క కేసు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల వ్యవహరించే తీరు, నమోదైన కేసుల వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రికార్డులు నిర్వహణ పై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాటాడుతూ భీంపూర్ పోలీస్ స్టేషన్ మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్నందున ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహిస్తూ గ్రామాలను సందర్శించాలన్నారు. ముందస్తు సమాచారాన్ని తెలుసుకొని శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అనుమతి లేని మహారాష్ట్ర దేశిదారును గ్రామాల్లో అమ్మకుండా చూడాలని, అలాంటి వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని సూచించారు. నిషేధిత గంజాయి వంటి వాటిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్ఐలు పురుషోత్తం, ఎస్సై కలీం, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏండ్లుగా శ్రమ దోపిడికి గురవుతున్న సమగ్ర శిక్ష సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న నిరసన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పానని మాట కోసం తలనైనా నరుకుంటా కానీ మాట తప్పద్దని ఇప్పుడు మాట్లాడాలి సమగ్ర శిక్షా ఉద్యోగులకు హన్మకొండాలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా దీక్షా శిబిరం నుంచి ఎన్టీఆర్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ నోటికి గుడ్డలు కట్టుకొని మౌన దీక్ష చేపట్టారు.

డీఎస్పీ పార్టీ నాయకుల మద్దతు

రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్న వారికి ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా నాయకులు మద్దతు తెలియజేశారు. ఈ సంద్భంగా డీఎస్పీ జిల్లా అధ్యక్షులు గణేష్ మహరాజ్ మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పే స్కేల్ అమలు చేయాలని, మహిళ ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన డిమండ్స్‌ని ప్రభుత్వం పరిగణనలోకి తీస్కొని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్, జిల్లా నాయకులు వెంకటేష్, రాజేశ్వర్, సంతోష్, గంగన్న, ఓమన్న సంతోష్, సాయి, వినోద్ పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి సీఎం కప్ క్రీడలు

నవతెలంగాణ-ముధోల్



ముధోల్

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. రెండు రోజులుగా వివిధ ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన 108 మంది క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ బాలురలో తరోడ తండా మొదటి స్థానం, రెండవ స్థానంలో విట్టోలి నిలువుగా, బాలిక కబడ్డీ పోటీలో మొదటి స్థానంలో ఆష్టా, రెండవ స్థానంలో ముధోల్ జీపీలు నిలిచాయి. వాలీబాల్‌లో మొదటి స్థానంలో ఎడ్‌బిడ్, ద్వితీయ స్థానంలో ముధోల్ జీపీ, బాలికలో మొదటి స్థానంలో విట్టోలి తండా, ద్వితీయ స్థానంలో ముధోల్, ఖోఖోలో బాలుర విభాగంలో మొదటి స్థానంలో ఆష్టా, ద్వితీయ స్థానంలో విట్టోలి తండా, బాలిక విభాగంలో మొదటి స్థానంలో ఆష్టా, ద్వితీయ స్థానంలో ఎడ్‌బిడ్ గ్రామపంచాయతీలు నిలిచాయి. గెలుపొందిన వారికి అధికారులు మెమొంటో, కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ శివకుమార్, ఎంఈఓ రమణ రెడ్డి, గ్రామపంచాయితీ ఈఓ ప్రసాద్ గౌడ్, పీడీ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



తాంసి

తాంసి : రెండు రోజులుగా తాంసి మండలాల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, భీంపూర్ మండలంలోని అందర్ బంద్ ఆశ్రమ పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలు కొనసాగాయి. బుధవారం క్రీడలు ముగియడంతో ప్రతిభ కనబరిచిన విజేతలకు తహసీల్దార్, ఎంపీడీఓలు బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు సీఎం కప్ క్రీడల పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రతి విద్యార్థికి ఏదో ఒక క్రీడల్లో ఆడాలనే ఉత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భీంపూర్ తహసీల్దార్ నలంద ప్రియ, స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ, ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి మోహన్ రెడ్డి, ఎంఈఓ శ్రీకాంత్, అశ్వత్, లీల, ఎంపీఓ లింగయ్య, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మరదలిపై వదిన కత్తితో దాడి

నవతెలంగాణ-ముధోల్



మరదలిపై వదిన కత్తితో దాడికి పాల్పడిన ఘటన ముధోల్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... మండల కేంద్రంలోని సాయి మాధవ్ నగర్‌లోని ఓ ఇంట్లో ఉద్యోగి హనుమంత్ రావ్ అద్దెకు ఉంటున్నారు. భార్య అశ్విని మారు వేషంలో వచ్చి మరదలపై కత్తితో దాడికి పాల్పడింది. వెంటనే గమనించిన స్థానికులు బాధితురాలిని హుటా హుటిన భైంసా ఆస్పత్రికి తరలించారు. ఒంటి నిండా కత్తిపోట్లతో తీవ్రగాయాలైన బాధితురాలిని మెరుగైన వైద్యం కోసం అక్కడినుండి ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. నిందుతురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని ముధోల్ సీఐ మల్లేష్ పరిశీలించారు. దాడికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సిఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో బాలుడి మృతి

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

అనారోగ్యంతో బాధపడుతూ బాలుడు మృతి చెందిన ఘటన లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీనివాస్, సుమలత దంపతుల పెద్ద కుమారుడు లక్ష్మన్(11)కు జ్వరం రావడంతో నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నెల రోజుల పాటు అక్కడ చికిత్స చేయించుకుని ఇటీవల ఇంటికి తీసుకువచ్చారు. సోమవారం రాత్రి పరిస్థితి విషమించి బాలుడు మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు.

ప్రభుత్వాలు మారినా..కొత్త వంతెన రాలేదు

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



నర్సాపూర్(జి) మండలం అర్లి(కె) వద్ద సుద్దవాగుపై నిర్మించిన ఇరుకు వంతెనపై జనం ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. భారీ వాహనాలు ఈ వంతెనపై నుంచి ప్రయాణించడాన్ని నిషేధించిన కార్లు, ఇతర వాహనాలు ఎదురెదురుగా వెళ్లలేని పరిస్థితి ఉంది. భయపడుతూ ప్రయాణించాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఈ ప్రభుత్వమైనా కొత్త వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన షాపుల కూల్చివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని శివాజీ చౌక్‌లో గల పెద్ద కూరగాయల మార్కెట్‌లో గల మున్సిపల్‌కు సంబంధించిన 36 షాపుల్లో 17 షాపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీన్ని కూల్చివేయాలని ఆర్డీఓ అధికారులతో పాటు కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో బుధవారం మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు, వన్ టౌన్ ఎస్సై అశోక్‌తో కలిసి శిథిలావస్థలో ఉన్న దుకాణాలను కూల్చివేశారు. కూరగాయల మార్కెట్లోని 17 షాపులు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయని మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు తెలిపారు. అధికారులతో పాటు కోర్టు ఉత్తర్వుల మేరకు ఇక్కడ కిరాయికి ఉన్న వారికి సమాచారం ఇవ్వడంతో వారు ఖాళీ చేశారన్నారు. దీంతో ఆ దుకాణాలను ఎలాంటి ప్రమాదం జరగకముందే కూల్చివేయడం జరిగిందన్నారు. ఈ స్థలం గురించి కౌన్సిల్లో ప్రవేశపెట్టి తీర్మాణాలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్, టీపీఓ సుమలత, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని సోన్ మండల నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అందించిన 108 వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అత్యావసర సమయాల్లో ప్రజల ప్రాణాలను కాపాడటానికి 108 సేవలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో అధికారులు ప్రసాద్, మండల వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-బేల

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం ఇవ్వాలని ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 73 మందికి కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులతో పాటు తనపై ఉందన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు వెంటనే లబ్దిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. లబ్దిదారులు మధ్య దళారులను నమ్మవద్దని సూచించారు. అలాంటిది ఉంటే తనకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ చైర్మన్ అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ సావాపురే విలాస్, మండల కాంగ్రెస్, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన తహసీల్దార్

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలోని కేజీబీవీనీ తహసీల్దార్ భూమేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆదేశాల మేరకు కేజీబీవీని సందర్శించి ఇక్కడి సమస్యలను తెలుసుకున్నారు. సరకులు, బియ్యంతో పాటు కూరగాయలను పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర వస్తువులను భోజనంలో ఉపయోగించాలని సూచించారు. విద్యార్థుల హాజరు పట్టిలను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ గౌరీ శంకర్, కస్తూర్బా ప్రత్యేక అధికారి అరుణ ఉన్నారు.

రాయితీ సిలిండర్లు పట్టివేత

నవతెలంగాణ-కౌటాల



మండలంలో రాయితీ సిలిండర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఉదయం విశ్వసనీయమైన సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్ కుమార్, శ్రీనివాస్ మండల కేంద్రంలోని పలు హోటళ్లలో తనిఖీలు చేశారు. తనిఖీలలో కమ్మర్షియల్ సిలిండర్ స్థానంలో అక్రమంగా వినియోగిస్తున్న 15 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. ఏ1 హోటల్ 3, వంశీ టిఫిన్ సెంటర్ 6, అక్షర టిఫిన్ 2, బాలాజీ బేకరి 4 సిలిండర్లు మొత్తం 15 సిలిండర్లు పెట్టుకున్నామన్నారు. రాయితీ సిలిండర్లను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలుంటాయి హెచ్చరించారు. పట్టుబడిన సిలిండర్లు గోదాంకు తరలించామని తెలిపారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి డిమాండ్ చేశారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని నాయకులు, కార్యకర్తలతో మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పెండింగ్ డీఏలు, పీఆర్సీ ప్రస్తావనలు లేకుండా ప్రభుత్వం ఉండడం సరికాదన్నారు. ఎస్ఎస్ఏ, యూఆర్ఎస్, కేజీబీవీ, వివిధ యాజమాన్యాల గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీ, పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్, గెస్ట్ ఉపాధ్యాయులందరికీ మినిమం టైమ్స్ స్కేల్ వర్తింప చేయాలన్నారు. హెల్త్ కార్డులతో పాటు నగదు రహిత వైద్యాన్ని అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. గురుకులాలలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులకు పారిటీ స్కేల్ మంజూరు చేయాలన్నారు. సోషల్ వెల్ఫేర్ గురుకులాలలో పార్ట్ టైం టీచర్స్, ఆశ్రమ పాఠశాల సీఆర్టీలకు ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు అందేలా చూడాలన్నారు. 317 జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు దశలవారీగా పంపించి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉండే ఈ ప్రభుత్వం సమస్యల పట్ల స్పందించాలని, ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రీతి, జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ లలిత, మండల అధ్యక్షులు మహిపాల్, జిల్లా కమిటీ సభ్యులు బాజీఖాన్, మండలాల బాధ్యులు సురేష్ కుమార్, రంజిత్, భరత్, రత్నపాల్, సురేందర్, పద్మ పుష్ప, ప్రవీణ్ హరీష్, గోపాల్ పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



నవతెలంగాన-బెజ్జూర్

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీసీఆర్‌బీ సీఐ కేశవ్ అన్నారు. మంగళవారం ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు బెజ్జూర్ ఎస్సై కె.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంలో కళాజాత బృందం ద్వారా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, గ్రామం పేరు నిలబెట్టాలని సూచించారు. మద్యానికి బానిస కాకుండా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైన మద్యం విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో గుడుంబా విక్రయాలు జరిపితే తెలుపాలని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సిబ్బంది రోహిత్, రామచందర్, వెంకటేష్, చంద్రశేఖర్, రజిత, సంగవి, కానిస్టేబుల్ వెంకటేష్, నవీన్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు శంకర్, గోపాల్, రమేష్, రంగయ్య, నారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె



నవతెలంగాణ- ఆసిఫాబాద్

సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం రెండో రోజుకు కొనసాగింది. కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని అన్ని విభాగాలకు చెందిన 460 మంది సిబ్బంది ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సందర్భంలో ప్రస్తుత ముఖ్యమంత్రి వరంగల్ లో ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. రాష్ట్ర నాయకులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని ప్రభుత్వ నుండి స్పష్టమైన హామీ వచ్చేవరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగుల సమ్మెతో వివిధ విభాగాల్లో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సతిక, ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం, గౌరవ అధ్యక్షులు కొప్పుల మోహన్, కోశాధికారి బోయిని నాగేష్ యాదవ్, మీడియా ప్రతినిధి గేడెకర్ సంతోష్, కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మ, కార్యదర్శి దుర్గం సందీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన అయ్యప్ప పడిపూజ

నవతెలంగాణ- ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సాయినివాడలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవ వేడుకలు అంబరాన్నంటేలా సాగాయి. సాయినివాడకు చెందిన సాయిని సంతోష్ స్వామి తన కుటుంబ సభ్యులతో 2వ శబరి యాత్ర సందర్భంగా తన నివాసంలో ఆదిలాబాద్‌కు చెందిన పండితులు గురుస్వాములు బ్రహ్మశ్రీ ఘనతుల మేఘరాజ్ శర్మ ఆధ్వర్యంలో పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాగజ్ నగర్, బెల్లంపల్లికి చెందిన గాయకులు, గురు స్వాములు పాడిన పాటలు భక్తులను అలరించాయి. స్వామికి పల్లకిసేవ చేస్తూ మాలదారులు పేటతుల్లి ఆటలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు చంద్రమోహన్, మోహన్, శ్యాంసుందర్, శ్రీనివాస్, బాల రాము, సంతోష్, శ్రీధర్, శ్రావణ్, స్వాములు పాల్గొన్నారు.

డుమ్మా టీచర్లకు చెక్

- పాఠశాలలో టీచర్ల ఫొటో, వివరాల ప్రదర్శన
- నకిలీ టీచర్ల నివారణకు సర్కారు చర్యలు


బడులకు వెళ్లకుండా విధులకు ఎగనామం పెట్టే ఉపాధ్యాయులపై చర్యలకు ఉపక్రమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మరోపక్క వారి స్థానంలో మరొకరిని నియమించి పాఠాలు చెప్పిస్తుండటం.. అధికారులను మచ్చిక చేసుకుంటూ రోజుల తరబడి బడికి వెళ్లకుండా విధులకు డుమ్మా కొడుతున్నారనే అపవాదు ఉంది. కొందరు ఉపాధ్యాయుల తీరు కారణంగా విద్యావ్యవస్థ అబాసు పాలవుతోంది. ఇలాంటి వారిపై చర్యలు చేపట్టేందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పాఠశాలలో టీచర్ల ఫొటోతో పాటు వివరాలు ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేసింది.

నవతెలంగాణ- కెరమెరి

విధులకు డుమ్మాలు కొట్టే టీచర్లు, తమకు బదులుగా ఇంకొకరిని నియమించి పనికానిచ్చే మాస్టర్ల ఆటలు సాగనివ్వకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం ఇక నుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫొటోలు, వారి వివరాలు ప్రదర్శించేలా తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏ పాఠశాలలో ఏ ఉపాధ్యాయుడు, ఎందరు పనిచేస్తున్నారనే వివరాలు ఆయా గ్రామాల వారికి తెలిసిపోతుంది. దీంతో సదరు ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరు అయిన పక్షంలో ఆ సమాచారం గ్రామస్తులు తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఆయా పాఠశాలలకు తనిఖీకి వెళ్లిన అధికారులు, నాయకులకు సైతం సదరు పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల వివరాలు తెలిసిపోతాయి. జిల్లాలో మొత్తం స్కూల్ కాంప్లెక్స్‌లు 85 ఉండగా ప్రాథమిక పాఠశాలలు 909 , ప్రాథమికోన్నత 173, ఉన్నత పాఠశాలలు 172 ఉన్నాయి.మొత్తం 1254 పాఠశాలలున్నాయి. మొత్తం ఉపాధ్యాయులు సుమారు 2200 మంది జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఇటీవల నూతనంగా జాయిన్ అయిన ఉపాధ్యాయులు సుమారు 342 మంది ఉన్నారు.

బడుల్లో టీచర్ల వివరాల డిస్‌ప్లే..

రాష్ట్రంలోని అన్ని సర్కారు బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఫొటోలు, వారి వివరాలు తాము విధులు నిర్వర్తిస్తున్న పాఠశాలల్లో ప్రదర్శించాలంటూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అక్కడక్కడ ఉపాధ్యాయులు కొందరు తమకు బదులుగా ఇతరులను నియమించి వారికి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు చెల్లిస్తూ తమ విధులను కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతంలో గతంలో ఇలాంటి ఘటనలు బయటపడ్డాయి. తాము విధులు నిర్వర్తించకున్నా నిర్వర్తించినట్లు పూర్తి వేతనం తీసుకుంటూ తమ స్థానంలో ఇతరులతో పనికానిచ్చేస్తున్నారు. ఇలాంటి సంఘటనల దృష్ట్యా నకిలీ టీచర్ల బెడద అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. కొందరు డుమ్మా టీచర్ల కారణంగా సక్రమంగా విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అనేక మారుమూల గ్రామాలున్నాయి.కేరమేరి, జైనూర్, సిర్పూర్ యు, తిర్యాణి, వాంకిడి, బెజ్జూర్, చింతల మానేపల్లి మండలాల్లోని చాలా గ్రామాల్లో పాఠశాలలకు ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, సక్రమంగా రావడంలేదనే ఆరోపణలున్నాయి.దీంతోపాటు మారుమూల మండలాల్లోని ఐటీడీఏ పాఠశాలల్లోనూ ఇలాంటి సమస్యలే ఉత్పన్నమవుతున్నాయి. ఉపాధ్యాయుడి పూర్తి వివరాల ప్రదర్శనతో ఇటువంటి సమస్యల పరిష్కారానికి టీచర్ స్థానంలో ఇతరులు వచ్చిన పక్షంలో విద్యార్థులకు, తర్వాత గ్రామస్తులకు వెనువెంటనే తెలిసిపోతుంది. ఫలితంగా డుమ్మా టీచర్ల ఆటకట్టించవచ్చునే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నాణ్యతలేని సరుకులు వినియోగిస్తే చర్యలు



నవతెలంగాణ- కెరమెరి

వంటకోసం నాణ్యత లేని సరుకులు వినియోగిస్తే చర్యలు తప్పవని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం మండలం లోని మోడి ఆశ్రమ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, ఆహారం తయారీకి వినియోగించే నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం, సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. వంట తయారీలో తాజా కూరగాయలు, నాణ్యత గల సరుకులను వినియోగించాలన్నారు. నాణ్యతలేని సరుకులు వినియోగించినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. విద్యార్థినులపై ప్రత్యేక మహిళా ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతను వివరించాలన్నారు. తాగునీరు, ఆహారం తీసుకునే సమయంలో తప్పనిసరిగా చేతులు శుభ్రపరుచుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల, వసతి గృహాలలో భోజనశాల, పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం ధనోరా గ్రామంలోని మండల పరిషత్ తెలుగు, ఉర్దూ మాధ్యమ పాఠశాలలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీడీ రమాదేవీ, ఏటీడీఓ శ్రీనివాస్, తహసిల్దార్ దత్తు ప్రసాదరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహమ్మద్ అంజద్ పాషా, ఎస్‌సిఆర్పీ శ్యామ్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు గూడు కల్పించాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలు, భూ సంబంధిత డాక్యుమెంట్లు, ఇతర వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారుల వివరాల నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అధికారులు, సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతం, హౌసింగ్ డీఈ వేణుగోపాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'మా తెగను అవమానపర్చడం మానుకోవాలి'



నవతెలంగాణ- కౌటాల

సంఘం నాయకులు కొలావార్ తెగను అవమానపర్చే విధంగా మాట్లాడటం మానుకోవాలని కొలావార్ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మెర్వెల్లి సదాశివ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొలావార్ సంఘం భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలాం సంఘం నాయకులు మా తెగను అవమాన పరిచినట్లు మాట్లడడం మానుకోవాలని హితవు పలికారు. కొలావార్ ఐక్యతను చూసి ఓర్వలేకనె ఆ సంఘం వారు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.ఈ నెల 16న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నిరసన తెలుపుతామని అన్నారు.ఈ ధర్నా కార్యక్రమానికి కొలావార్ తెగకు చెందిన వారు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలు సామాజిక దురాచారం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

బాల్య వివాహాలు సామాజిక దురాచారమని, బాల్య వివాహాల వల్ల బాలల విద్య,రక్షణ,ఆరోగ్యం, అభివృద్ధి, భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని జిల్లా బాలల సంరక్షణ విభాగం సామాజిక కార్యకర్త డోంగ్రే ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం మరియు చైల్డ్ హెల్ప్ లైన్ వారి ఆధ్వర్యంలో బాల వివాహ్ ముక్త్ భారత్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. విద్యార్థి దశలో నుండే బాలలు హక్కులు,చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.బాల్య వివాహాల చట్టం 2006 గురించి అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఎవరైనా బాల్య వివాహాలను నిర్వహిస్తే 1098 లేదా డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సదాశివుడు, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, దుర్గం పీతాంబర్, కేస్ వర్కర్ తిరుపతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలో ఐటీడీఏ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

ఈనెల 16న చలో ఐటీడీఏను విజయవంతం చేయాలని కోలాం సంఘం మండల అధ్యక్షుడు సిడాం ధర్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మన్నెవార్‌లు కోలవార్‌లేనా కదా అనే అంశాన్ని తేల్చలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీ వేసి మరో సారి విచారణ చేపట్టి వాస్తవాలను కేంద్ర ప్రభుత్వానికి అందించాలన్నారు. 2021లో గిరిజన శాఖ కమీషనర్ మన్నెవార్లను పీవీటీజీలుగా గుర్తింపునివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మన్నెవార్లకు కొలవార్‌గా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారని తెలిపారు. వారు ఎస్టీలైనప్పటికి వారికి మన్నెవార్‌గా ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో కొలవార్ సమాజం అస్తిత్వంకోల్పోయే ప్రమాదముందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే చలో ఐటీడీఏకు పిలుపినిచ్చినట్టు తెలిపారు. జిల్లాలోని కొలవార్‌లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమురం సూరు ఉత్సవ కమిటీ చైర్మన్ సిడాం రాజు, మాడావి మాన్కు, భీము, రాజు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగంపై నైపుణ్య శిక్షణ



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉన్నతి ట్రైనింగ్‌లో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లిలోని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్. శివకృష్ణ, డాక్టర్ తిరుపతి, నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పనిచేసిన కూలీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు వస్తున్నాయని, శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తే పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉందని, వ్యవసాయంలో పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఆ పరీక్షల ఆధారంగానే పంటలు వేసుకోవడం, వ్యవసాయ అధికారుల సూచనల మేరకే మందుల వాడకం చేస్తే నష్టాలు కలగకుండా లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకోవాలనుకునే రైతులు కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి వారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి. దత్తారావు హాజరయ్యారు, ఆయనతో పాటు ఎంపీడీఓ వి.ప్రవీణ్ కుమార్, ట్రైనింగ్ ఇన్‌చార్జి హెచ్‌ఆర్ మల్లేష్, ఐకేపీ ఏపీడీ రామకృష్ణ, ఏపీఓ శ్రావణ్ కుమార్, ఏపీఎం మహేష్, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సినీ నటుడు మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. హైదరాబాదులో మంచు కుటుంబంలో చెలరేగిన వివాదం కవరేజ్‌కు వెళ్ళిన జర్నలిస్టులపై మోహన్ బాబు దాటికి దిగడంపై జర్నలిస్టు సంఘాలు మండిపడ్డాయి. అతనిపై కేసు నమోదు చేయాలని బుధవారం ఆసిఫాబాద్ సీఐ రవీందర్‌కు జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

నేడు ఉచిత రక్తదాన శిబిరం

నవతెలంగాణ- కెరమెరి

మండల కేంద్రంలో అబ్దుల్ కలాం యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత రక్త దాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు దనోరా మాజీ ఉప సర్పంచ్ సయ్యద్ రిజ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ ఫోరం మాజీ జిల్లా అధ్యక్షులు (మాజీ వైస్ ఎంపిపి)సయ్యద్ అబ్దుల్ కలాం జన్మదినం సందర్భంగా రక్త దాన శిభిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాలులో ఉదయం 11గంటలకు ప్రారంభం కానుందని తెలిపారు. మండలంలోని యువత రక్త దానం చేయుటకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేపు మినీ జాబ్ మేళా

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 13న ఉదయం 10.30 గంటలకు నిరుద్యోగ యువతకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కిమ్స్ ఫౌండేషన్ రిసర్చ్ సెంటర్-సికింద్రాబాద్ సంస్థలో హైదరాబాగ్‌లో పని చేసేందుకు 20-జనరల్ డ్యూటీ అసిస్టెంట్, 20-హాస్పిటల్ బిల్డింగ్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని, అభ్యర్థులు జనరల్ డ్యూటీ అసిస్టెంట్ పోస్టుకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై ఇంటర్ పాస్/ఫెయిల్, హాస్పిటల్ బిల్డింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు డిగ్రీ పూర్తి చేసి 18-29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు 8247255859, 8019816641, 9110368501 నెంబర్లలో సంప్రదించవచ్చని, అర్హత గల అభ్యర్థులు సకాలంలో జాబ్ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మల్కెపల్లిలో కార్డెన్‌సెర్చ్



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కెపల్లి గ్రామంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. మందమర్రి సర్కిల్ ఎస్ఐలు, 40 మంది సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. వాహన పత్రాలు సరిగా లేని 43 బైక్‌లను, 3 ఆటోలను సీజ్ చేశారు. గుడుంబా అమ్ముతున్న వ్యక్తి వద్ద రెండు లీటర్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సంధర్భంగా మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు, యువత మత్తుకు బానిస కావొద్దు

- యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాలను సాధించడం కోసం కష్టపడాలని జన్నారం ఎస్ఐ తానాజీ అన్నారు, బుధవారం యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలను వ్యతిరేకిద్దాం బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం అనే నినాదంతో ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్లను పోలీస్‌స్టేషన్ ఎదుట విడుదల చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ యువత చేడు వ్యసనాలకు ఎల్లపుడు దూరంగా ఉండి తమ లక్ష్యాల వేటలో ఉండాలని విజ్ఞప్తి చేశారు, కొన్ని అనుకోని సందర్భలలో మానసిక స్థితి బాగా లేక అలవాటైన కొన్ని చెడు వ్యసనాలు మీ కుటుంభలనే నాశనం చేసే విధంగా మారుతాయనే విషయాన్ని యువత విద్యార్థులు గుర్తుంచుకోవాలని కోరారు. మీకు ఈ వయస్సులో అన్ని విషయాలు తెలుసుకోవాలనే ఆత్రుత ఉండటంలో తప్పు లేదు కానీ అవి మంచి విషయాల వరకే ఉండాలి తప్ప మీ జీవితాలను, మీ లక్ష్యాలను పాడు చేసే విధంగా ఉండదని యువతకు సూచించారు. డ్రగ్స్ తీసుకున్న వాటిని ప్రోత్సహించిన కఠిన మైన శిక్షలు ఉంటాయన్నారు. మీరు కేస్ లలో చిక్కుకునే ప్రమాదం కూడా ఉంది కాబట్టి దాని వల్ల మీరు ఎలాంటి ఉద్యోగాలకు కూడా అప్లై చేసుకోలేరన్నారు. యువత, విద్యార్థులు అంత కూడా మత్తు పదార్థాలకు దూరంగా క్షేమంగా ఉండాలని ఈ సంధర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, రాజ్ కుమార్, ప్రణయ్, మణీసాగార్, అక్షయ్, అంజు పాల్గొన్నారు.

కొలాం సంఘం ఆరోపణలు అర్థరహితం



తెలంగాణ-తాండూర్

ఆదివాసీ కొలవార్ తెగను కోలామ్ సంఘ నాయకులు కొలవార్‌లు ఎస్టీలు కాదని దుష్ప్రచారం చేయడం అర్థరహితమని కొలవార్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండిగ రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తాండూర్ ప్రెస్ క్లబ్‌లో కుల సంఘం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొలవార్ తేగ అయిన మేము రాజ్యాంగబద్ధంగా ఐఎస్టీ జాబితాలో 1950 సంవత్సరం నుండి నేటి వరకు ఎస్టీ హోదాలోనే ఆదివాసీ తెగలలో అత్యంత వెనుకబడిన తెగగా జీవిస్తున్నామన్నారు. 2003 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం తమను మన్నే వార్లకు బదులుగా కోలవార్లుగా పార్లమెంటులో చట్ట సవరణ చేయడం జరిగిందన్నారు. మా తెగ అయినటువంటి కొలవార్ చైతన్యాన్ని ఐకమత్యాన్ని ఓర్వలేని కోలాం సంఘ నాయకులు వారి వ్యక్తిగత స్వార్థ ప్రయోజనం కోసం మమ్ములను అవమానపరిచి కించపరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కొలవార్ తెగకు సంబంధించిన పథకాలు గాని, అభివృద్ధిలో గాని అడ్డుకుంటే సహించేది లేదన్నారు. కొలం తెగను ఎస్టీ ఆదివాసీ జాబితా నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కిష్టంపేట మాజీ సర్పంచ్ గడ్డం మణికుమార్, ఆదివాసీ కొలవార్ సేవా సంఘం మండల ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య, ఉపాధ్యక్షులు ఉరాడి మహేష్ పాల్గొన్నారు.

విద్యాభారతికి జాతీయ స్థాయి అవార్డు

నవతెలంగాణ-తాండూర్



వినూత్న పద్దతిలో విద్యాబోధన అందించినందుకు గాను తాండూర్ విద్యా భారతి విద్యాసంస్థకు జాతీయ స్థాయిలో మెదటి స్థానం సాధించిని అవార్డు అందుకున్నట్లు సంస్థ డైరెక్టర్ సురభి శరత్ కుమార్ తెలియజేశారు. మంగళవారం బెంగళూరులోని తాజ్ హోటల్‌లో డైనమిక్ ఎడ్యుకేటర్ సమ్మేట్-2024 స్టేట్ బోర్డు స్కూల్ విభాగం లో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఎడ్యుకేషన్ టుడే వారు నిర్వహించిన సర్వేలో 3246 ఓట్లు పొంది ఈ అవార్డు స్వంతం చేసుకునట్టు వారు తెలిపారు. సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకలకు సిద్దమవుతున్న వేళ ఈ అవార్డు విద్యా భారతి పరివారానికి శోభ తెచ్చి నట్టు వారు తెలిపారు. వోటింగ్ ద్వారా అవార్డు రావడానికి కారణమైన అందరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

పంచాయతీల్లో డీపీఓ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను, కోనూరు, కొండాపూర్, దేవాపూర్ గ్రామ పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను నిర్వహిస్తూ తడి చెత్తతో వర్మి కంపోస్ట్ తయారు చేయాలని ఆదేశించారు. అదే విధంగా ఈ నెలాఖరు వరకు ఇంటి పన్నులు వంద శాతం వసులయ్యేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం పంచాయతీలలో యాప్ ద్వారా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. డీపీఓ వెంట ఎంపీఓ షేక్ సప్దర్‌అలీ, అయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఫీజు బకాయిలు విడుదల చేయాలి
- ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ పటేల్

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని "నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ అన్నారు, బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని విద్యార్థులతో కలిసి ముట్టడించారు. ఈ సంధర్భంగా రామ్ ప్రసాద్ మాట్లాడుతూ జన్నారం మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కొన్ని ఏండ్ల నుండి డిమాండ్ ఉన్న కూడా అధికారులు పట్టించుకోవడం లేదని, మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేకపోవడం వల్ల దాదాపుగా ప్రతి ఏటా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న దాదాపు 200 నుండి 300 మంది విద్యార్థులు బయటకు వచ్చినప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేకపోవడంతో 60శాతం విద్యార్థులు డ్రాప్ ఔట్స్ గా మిగుల్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా రాష్ట్రంలో దాదాపుగా 3 ఏండ్ల నుండి ఫీజు బకాయిలు విడుదల కాక విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా పీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఇప్పుడు ఉన్న స్కాలర్ షిప్స్ పెంచి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులకు ప్రస్తుత ధరలకు అనుకుణంగా అందిస్తామని చెప్పి మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాత్రం దాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. అదే విధంగా విద్యారంగంలో కూడా అనేకమైన సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటున్న కూడా విద్యాశాఖను తమ వద్ద ఉంచుకున్న ముఖ్యమంత్రి గారు విద్యాశాఖ మీద సమీక్ష చేయకపోవడం అన్యాయం అన్నారు. వెంటనే తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయని పక్షంలో రానున్న రోజులలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు రంజిత్, నగేష్, మహేష్, తిరుపతి, కరుణాకర్, దివ్యమహేశ్వరి, 300మంది విద్యార్థులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన విద్యార్థులు

క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి

- మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-జైపూర్

ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన సీఎం కప్-2024 ఆటల పోటీల్లో పాల్గొంటున్న వారు క్రీడా స్ఫూర్తితో కొనసాగాలని స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఎం కప్ ఆటల పోటీలు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి ప్రారంభించారు. ఆసక్తికి అనుగుణంగా ఆటల పోటీల్లో పాల్గొంటూ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి పోటీలలో తలపడే విధంగా క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబర్చాలని కోరారు. 130 మంది మండల స్థాయిలో పోటీల్లో పాల్గొంటున్నట్లు స్థానిక ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. లాంగ్ జంప్, కోకో, వాలిబాల్, కబడ్డీ, శాట్‌పూట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు.

జన్నారం : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం సీఎం కప్ క్రీడా పోటీలను ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ రజమనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కిందన్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, రన్నింగ్, ఇతర అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైనటువంటి విద్యార్థులకు మెడల్స్‌తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరాజన్, కిష్టాపూర్ ఉపాధ్యాయులు ప్రకాష్ బానావత్, ఫిజికల్ డైరెక్టర్లు యాకూబ్, సాగర్, కాంతయ్య, చరిష్మా, ఇతర పీఈటీలు వివిధ పాఠశాలల నుంచి పీడీలు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : మండల స్థాయి సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.సరోజ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎంజేపీ పాఠశాలలో మండల స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్ జరగనున్నాయి. వాలీబాల్, కబడ్డీ, కో-కో , అథ్లెటిక్స్‌లో జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి హెలెన్ డోరతి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఉంటారని పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏంజెపీ పాఠశాలలు ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ అనుమతి మేరకు వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు బండ జీవరత్నం గ్రౌండ్‌ను పరిశీలించి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ క్రీడా పోటీలకు హాజరైన విద్యార్థులు ఉదయం 9 గంటలకు స్థానిక ఎంజేపీ పాఠశాలలో రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో...

ప్రజలకు సత్వరమే న్యాయం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

బాధితులు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదిస్తే వారికి సత్వరమే న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజెన్ లతో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. పోలీస్‌స్టేషన్ రికార్డ్స్, పోలీస్ అధికారులు సిబ్బంది వివరాలు, వారు చేస్తున్న విధులు, పని తీరు, వారికీ ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధి బౌగోలిక పరిస్థితులు, కాలనీ, గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే అంశాలను ఎస్ఐ ని అడిగి తెలుసుకున్నారు. బ్లూ క్లోట్స్ సిబ్బందితో మాట్లాడి డయాల్ 100 కాల్స్‌కి వెంటనే స్పందించి వారు సంఘటన స్థలంకి త్వరగా చేరుకోవాలని సూచించారు. బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బంది రాత్రి సమయంలో రౌడీ షీటర్స్ కేడిలు, డీసీలు, సస్పెక్ట్ షీట్స్‌ల ఇళ్లను, పాయింట్ బుక్స్‌లను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు, పిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని, గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్ఐలు సంతోష్, లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

12,13న దగాపడ్డ కళాకారుల డప్పుల మోత

నవతెలంగాణ-తాండూర్

హైదరాబాద్‌లోని సుదరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12,13న దగాపడ్డ కళాకారుల డప్పుల మోత కార్యక్రమాన్ని కవి గాయకులు నేర్నాల కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నృత్య కళాకారుడు మధు తెలిపారు. బుధవారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత శ్రీధర్ 31వ వార్డు కౌన్సిలర్ గెల్లి రాయలింగు చేతులమీదుగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో పని చేసిన కళాకారుల కోసం సాంస్కృతిక సారథి ఏర్పాటు చేసి 550 మంది కళాకారులకు ఉద్యోగాలు కల్పించిందని, ఆ నియామాకాల్లో చాలా అవకతకవకలు జరిగాయని తెలిపారు. అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారని. నిజమైన కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని నిలదిసిన కళాకారులకు రెండవ విడతలో ఇస్తామని హామి ఇచ్చరని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు పెంచి కళాకారులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, ప్రముఖులు, కవులు, కళాకారులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అధిక సంఖ్యలో కళాకారులు ఈ కార్యక్రమంలోని 32 గంటలు ఆట-పాట కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నృత్య కళాకారులు బొంకూరి రాంచెందర్, జంజిరాల దినేష్ కుమార్, మిట్టపల్లి మల్లేష్, బొంకూరి రవి, ఇనుగుల రాయమల్లు, రామగిరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



కాసిపేట గనిపై మల్టీడిపార్ట్మెంటల్ సమావేశం



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-1 ఇన్‌క్లైన్ గనిపై మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్, ఏరియ జీఎం జి దేవేందర్ ఆధ్వర్యంలో మొదటి, రెండవ, మూడవ షిఫ్టలో కార్మికులకు మల్టీ డిపార్ట్మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను సాధించిన విషయాలను, భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులలో యంత్రాల వినియోగం, సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమం ఫైనాన్సు విషయాలను విపులంగా చర్చించారు. అదే విధంగా కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలు, కంపెనీ ముందున్న సవాళ్లను కంపెనీ యొక్క లక్ష్యాలను సాధించడానికి చేయాల్సిన పనులపై చర్చించారు. గని ఉద్యోగస్తులు కంపెనీకి సూచించిన సలహాలు సూచనలు పాటించడం వల్ల ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుందని, అందరూ నిబద్ధతతో తమకు కేటాయించిన పనులను చేయడం వలన అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామని అన్నారు. తమ పనితనాన్ని మెరుగుపరచుకోవడం వలన లక్ష్య సాధన సులువు అవుతుందని సమావేశంలో కార్మికులకు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఎస్ వోటీజీఎం విజయ్ ప్రసాద్, డీజీఎంలు వై వెంకటరమణ, ఆర్వీఎస్ఆర్కే ప్రసాద్, రాజన్న, డీవైపీఎం ఎండీ ఆసీఫ్, గని మేనేజర్ భూ శంకరయ్య, సేఫ్టీ ఆఫీసర్ నిఖిల్ అయ్యర్, టీబీజీకేఎస్ కార్యదర్శి వొడ్నాల రాజన్న, పిట్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆధునీకరించిన కార్యాలయాన్ని ప్రారంభించిన జీఎం



నవతెలంగాణ-నస్పూర్

జీఎం కార్యాలయంలోని ఆధునికరించిన లా విభాగమును ఏరియా జీఎం సూర్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా లా విభాగ కార్యాలయంను ఆధునికరించడం జరిగిందని, ఉద్యోగులు అందరూ తాము పనిచేస్తున్న ప్రదేశాలు ఎంత పరిశుభ్రంగా ఉంటే వారి పని మరింత మెరుగవుతుందని తెలిపారు. ఉద్యోగులందరూ తమకు కేటాయించిన విధులను విధిగా నిర్వర్తించాలని సంస్థ అభివృద్ధిలో ప్రతి ఒక్క ఉద్యోగి పాటుపడాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కే వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎంలు పి అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, శిరీష్‌రెడ్డి, ఏరియా సర్వే అధికారులు వెంకటేశం, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి, సెక్యూరిటీ అధికారి జక్కిరెడ్డి, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, డీవై పీఎం రాజేశ్వర్‌రావు, రాజేష్ పాల్గొన్నారు.

ఏబీఏపీ తెలంగాణా రాష్ట్ర మీడియా ఇన్‌చార్జిగా భాస్కర్ల రాజేశం ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణా రాష్ట్ర అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ(ఏబీఏపీ) మీడియా ఇన్‌చార్జిగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కాలనీకి చెందిన భాస్కర్ల రాజేశంను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు టీవీ పుల్లం రాజు, ప్రధాన కార్యర్శి కర్క సిద్దు, కోశాధికారి మూడా శ్రీనివాస్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 5 సంవత్సరాలుగా భాస్కర్ల రాజేశం ఏబీఏపీలో అందించిన సేవలను గుర్తించి జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్రావు సూచన మేరకు జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాస్ మంచిర్యాలలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకొని బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర కమిటి తీర్మాణం మేరకు రాజేశంను తెలంగాణా మీడియా ఇన్‌చార్జిగా నియమించామని తెలిపారు. ఈ సందర్భంగా బాస్కర్ల రాజేశం తన సేవలు గుర్తించి తెలంగాణా రాష్ట్ర ఏబీఏపీ మీడియా ఇన్‌చార్జిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాస్, ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్రావు, రాష్ట్ర అధ్యక్షుడు టీవీ పుల్లం రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఏబీఏపీ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల ఏర్పాటులో, ధార్మిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి, భక్తులకు చేరే విదంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. భాస్కర్ల రాజేశం తెలంగాణా రాష్ట్ర మీడియా ఇన్‌చార్జిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజకిరణ్ హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్య ప్రణాళిక అధికారిగా జి.సత్యం బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

ముఖ్య ప్రణాళిక అధికారిగా జి.సత్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా గణాంక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.సత్యం ప్రస్తుతం ముఖ్య ప్రణాళిక అధికారిగా పని చేస్తున్న మొహ్మద్ ఖాసీం నుండి బాధ్యతలు స్వీకరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | డిసెంబర్ 12, 2024 | www.navatelangana.com

మొదలైన ఇందిరమ్మ ఇండ్ల సర్వే

నవతెలంగాణ-జైపూర్



మండల పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీకి సంబంధించిన లబ్ధిదారుల గుర్తింపు మొదలైనట్లు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి మంగళవారం కానుకూరు గ్రామంలో సర్వేను పరిశీలించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల వారిగా చేపట్టిన సర్వే ద్వార అర్హులైన వారిని మాత్రమే గుర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పారదర్శకంగా సర్వే పూర్తి చేసి గుర్తించిన లబ్ధిదారులకు సంబంధించిన వివరాలతో కూడిన జాబితా జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

దాచి ఉంచిన కలప పట్టివేత

నవతెలంగాణ-జన్నారం



జన్నారం టైగర్ జోన్ పరిధిలోని ఇంధన్‌పెల్లి రేంజ్ కవ్వాల్ గ్రామంలో గడ్డివాములో అక్రమంగా దాచి ఉంచిన టేకు కలపను, ఫర్నిచర్‌ను సిబ్బందితో వెళ్లి ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ కలప, ఫర్నీచర్ విలువ రూ.35వేలు ఉంటుందని తెలిపారు. ఒకరిపై కేసు నమోదు చేసి కలప, ఫర్నీచర్‌ను ఇంధన్‌పల్లి అటవీ శాఖ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

రైతులందరూ అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కౌటాల

పులి సంచారం కారణంగా రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ ముత్యం రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని జనగాం గ్రామంలో ఎస్సై ఎస్.మధుకర్‌తో కలిసి పులి సంచారం, సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పత్తి ఏరేందుకు వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు చాలా జరుగుతున్నాయని వాటి పై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని వారు ఫోన్ చేసి మీ వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. యువత చెడు దారిన పడకుండా ఉండాలని క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వాలీబాల్ కిట్ అందించారు. చలి తీవ్రత పెరగడంతో 50 పేద కుటుంబాలకు వెచ్చటి దుప్పట్లు అందించారు.

పేదింటి చీరల పంపిణిలో వివక్ష తగదు

నవతెలంగాణ-కెరమెరి

రాష్ట్ర ప్రభుత్వం పేదింటి చీరల పంపిణీలో వివక్ష తగదని మాజీ జడ్పీటీసీ సెడ్మకి ద్రుపతబాయి అన్నారు. బుధవారం ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదింటి చీరలను ఐకేపీ సిబ్బందితో గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కేవలం మహిళా సంఘాల్లో ఉన్న మహిళలకు మాత్రమే పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని మహిళందరికి ఎందుకు పంపిణి చేయడం లేదని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండగ సందర్భంగా రాష్ట్రంలోని 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరలు అందజేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా కొంతమందికి మాత్రమే పంపిణీ చేయడమేంటని ప్రశ్నించారు.

ప్రభుత్వం స్పందించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు బుధవారం ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్‌లో ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెట్టిచాకిరి చేయించుకొని, వేతనాల కోసం నెలల కొద్ది వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని. మా శ్రమను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగులకు వయసు మీరిపోతున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం చాలా బాధాకరమన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్ జోగేందర్, షబానా, షరీఫ్, సజరత్ అలీ,సందీప్ మహేష్ తదితరులున్నారు.

రేపు సీఎం కప్ క్రీడలు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మైదానంలో సీఎం కప్ క్రీడలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు క్రీడలను ప్రారంభించనున్నట్లు, ఈ క్రీడలలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, బోనోఫైడ్, ఎస్ఎస్‌సీ మెమోలతో హాజరు కావాలన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ మండల అధ్యక్షుడిగా తిరుపతి

నవతెలంగాణ-బెజ్జూర్

జగిత్యాల రూరల్ మండల పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహ గార్డెన్‌లో మంగళవారం జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్హెచ్ఆర్సీ) ఆధ్వర్యంలో నేషనల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు ఐలేని శ్రీనివాస్ రావు మాట్లాడుతూ జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కోసం హక్కులు ఎలా సాధించుకోవాలో వివరించారు. అలాగే కామ్రే తిరుపతిను బెజ్జూర్ మండల అధ్యక్షుడిగా నియమిస్తు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర బాధ్యతలు ఇచ్చినందుకు జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు

వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఆధ్వర్యంలో ఉన్న భీమన్న స్టేడియంలో కల వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు నోచుకోక రెండు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉందనివాకర్స్ అసోసియేషన్ నాయకులు మాల్‌రాజ్ శ్రీనివాసరావు అన్నారు. వాకింగ్ ట్రాక్ మధ్యలో రెండు కరెంటు పోల్స్ కూడా ఉన్నాయని, వాకింగ్ ట్రాకు పక్కకు ఉన్న ఫెన్సింగ్‌కు ఆనుకొని అవసరం లేని కొన్ని చెట్ల వలన గాలి ఆడడం లేదన్నారు. మరుగుదొడ్లను పరిశుభ్రం చేసి అందుబాటులోకి తీసుకురావాలని, ఎంతో ఇక్కడికి వ్యాయామం కోసం వస్తుంటారన్నారు. చిన్నపాటి వర్షానికే బురద ఉండడం వలన వాకింగ్ చేయలేకపోతున్నారని సింగరేణి యాజమాన్యం స్పందించి వాకింగ్ ట్రాక్‌కు మరమ్మత్తు చేయాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఉపేందర్, సాగర్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బెల్లంపల్లి ఏరియాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయని అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో జరుగుతాయన్నారు. ఈ వేడుకల సందర్భంగా వివిధ విభాగాల్లో పోటీలుంటాయన్నారు. ఆసక్తి గలవారు సంభందిత లిఖిత పూర్వక దరఖాస్తులను ఈనెల 19న సాయంత్రం 4 గంటలలోపు పర్సనల్ డిపార్ట్మెంట్‌లో అందజేయాలన్నారు. నిర్ణీత గడువులోపు వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు.

16న సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 16న బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆయుర్వే వైద్య శిబిరం నిర్వహించనున్నారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యములో గోలేటి టౌన్ షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో శిబిరం కొనసాగుతుందని, ఉద్యోగులు, గ్రామస్తులను పరీక్షించి దీర్ఘకాలిక వ్యాదులు కీళ్ళ, మోకాళ్ళ నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, అస్తమా, స్త్రీల వ్యాధులు మొదలగు వాటికి మందులు అందజేస్తారు. ఉద్యోగులు, గ్రామస్తులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి కోరారు.

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం

నవతెలంగాణ-నస్పూర్



కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని జీఎం సూర్యనారాయణ అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో గుర్తింపు సంఘం, ఏఐటీయూసీ నాయకులతో జీఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ సూచించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడం జరుగుతుందని, దానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి పరిష్కరించుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ టి శ్రీనివాస్, ఏజెంట్లు కుర్మ రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎంలు పి అరవింద రావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, డీవై పీఎం దేవేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కిషన్ రావు, కొమురయ్య, ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీఆర్టీలను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు రిసోర్స్ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర పూల్ సింగ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈనెల 29న నిర్వహించే చలో హైదరాబాద్ సన్నాహక సమావేశం జిల్లా కేంద్రంలో సీఆర్టీలు నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 2685 మంది కాంట్రాక్టు అవుట్ సోర్సిర్స్ టీచర్లను పర్మనెంట్ చేయాలన్నారు. 24 సంవత్సరాల నుండి గిరిజన ఆశ్రమ పాఠశాలల అభివృద్ధి కోసం పాటుపడుతున్న వారి సేవలు ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల ఎర్రయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని మభ్యపెట్టి వెళ్లిపోయిందని ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే పంథాను అనుసరించకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్టీల రెగ్యులర్ తర్వాత ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ వేయాలన్నారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఈనెల 29న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జర్పుల విజేశ్, ఆత్రం పెంటయ్య, శంకర్ దేవ్, లావుడియా రమేష్, శ్రీనివాస్, ప్రకాష్ రాథోడ్, గురుకులం బోధనేతర సంఘం నాయకులు ఎల్లాది ఐక్కయ్య, గోగుల నగేష్, ఆడ వెంకటేష్, బండి వెంకటేష్ పాల్గొన్నారు.

నూతన కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం

- మూడు బ్యాచులకు వారం రోజుల పాటు శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నైపుణ్యతతో కూడిన పనితనాన్ని ప్రదర్శించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. బుధవారం నూతన సివిల్ పోలీస్ కానిస్టేబుల్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. తొలిరోజు పోలీస్ కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ శిక్షణలో భాగంగా పోలీస్‌స్టేషన్ నిర్వహణ, పోలీస్‌స్టేషన్లో ఉండే విధులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి ముగ్గురు నిష్ణాతులైన అధికారులను నియమించి శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. సిబ్బంది అందరూ నైపుణ్యతతో కూడిన పరిజ్ఞానాన్ని నేర్చుకొని విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే క్రమంలో ప్రతిరోజు ఒక నూతన విషయాన్ని తెలుసుకునే సంఘటనలు ఎదురవుతాయని, వాటన్నింటినీ అధిగమించి ఉత్తమమైన పోలీసులుగా జిల్లా కీర్తిని పెంపొందించాలని సూచించారు. గత సంవత్సరాల నుండి నేర నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తున్న బీట్ పద్దతిని ప్రతి ఒక్కరు క్షుణ్ణంగా తెలుసుకొని నేర్చుకోవాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ వారిగా గ్రామాలను సందర్శిస్తూ ప్రజలలో సత్సంబంధాలను మెరుగుపరుచుకొని సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో ఎలాంటి పరిస్థితి ఏర్పడిన వెంటనే పోలీసులకు సమాచారాన్ని తెలియజేసే విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిఘా వ్యవస్థ పటిష్టం కావాలంటే మానవ సమాచారంతోపాటు సోషల్ మీడియాలో కూడా ముఖ్య పాత్రను పోషిస్తూ ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలను ఏర్పాటు చేసుకున్నప్పుడు ఎలాంటి సందర్భంలోనైనా చాకచక్యంగా వ్యవహరిస్తూ సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. ముఖ్యంగా ప్రజలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తూ 1930 టోల్ ఫ్రీ నెంబర్‌పై అత్యవసర సమయాలలో స్పందించాలని తెలియజేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ సమాచార వ్యవస్థపై పూర్తి పరిజ్ఞానాన్ని తెలుసుకొని అత్యవసర సమయాలలో వినియోగించే విధంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా సిపిఆర్, కోర్టు డ్యూటీ, ఫైనాన్షియల్ మేనేజ్మెంట్, పోలీసు విధులు లాంటి వాటిపై ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటి, ఎస్సై ముజాహిద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడల అభివృద్ధి కోసం చర్యలు

- ఆర్డీఓ లోకేశ్వర్‌రావు
- మండల స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆర్డీఓ లోకేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడ పాఠశాల మైదానంలో నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆర్డీఓ హాజరై జెండా ఊపి ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సాహకానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపిక అవుతారని, తర్వాత రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీలలో వివిధ గ్రామపంచాయతీల నుండి 250 మంది క్రీడాకారులు పాల్గొనగా వివిధ క్రీడల్లో గెలుపొందిన 120 మందిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, ఏసీఎంఓ ఉద్ధవ్, ఎంఈఓ సుభాష్ రాథోడ్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, గిరిజన క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగు, ట్రస్మా సభ్యులు చారి, వ్యాయమ ఉపాధ్యాయులు విద్యాసాగర్, మధుసూదన్, శారదా, తిరుపతి, కోచ్ విద్యాసాగర్, తిరుమల్, పీఈటీలు రాకేష్, చిన్నక్క పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : విద్యార్థులకు విద్యతో పాటు కూడా క్రీడలు కూడా అంతే అవసరమని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఈ పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. పల్లెల నుండి ప్రపంచ స్థాయి విజేతలుగా అవతరించేందుకు ఇలాంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువత అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రపంచ స్థాయి విజేతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వేణుగోపాల్, ఎస్సై కమలాకర్, గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



సిర్పూర్(టి)లో..

ఐటీ ఆధారిత సేవలను బలోపేతం చేయాలి

- జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లు కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఐటీ ఆధారిత సేవలను సంఘ సభ్యులు, సభ్యేతరులకు అందించి ఆర్థికంగా బలోపేతం చేయాలని జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం కేసీటీసీ-వరంగల్ ప్రిన్సిపల్ ఎల్.యాకూబ్ నాయక్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని యూనివర్సల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో సీఎస్‌సీ అంశంపై పీఏసీఎస్ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సౌకర్యాలను కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా అందిపుచ్చుకొని పౌర సేవలను గ్రామ ప్రజలకు విస్తారంగా అందించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని తెలిపారు. సహకార సంఘాలు సీఎస్‌సీ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఐటీ ఆధారిత సేవలను అందించి ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ జిల్లా మేనేజర్ రోహిత్, బ్యాంక్ సీఈఓ, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రర్ మూర్తి పాల్గొన్నారు.

మల్కెపల్లి ఆశ్రమ పాఠశాల సందర్శన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మల్కెపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కొన్ని సమ్యసలు తెలిపారని, భోజన సౌకర్యం, నీటి సౌకర్యం, గదులు సరిపోవడం లేదని వివరించారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు వాళ్ళకి ఉండడానికి కావాల్సిన సౌకర్యాలు లేక వేరే ప్రాంతాల నుండి రావడం జరుగుతుందన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగిన కారణంగా నూతన భవనాలు కావాలని ఎమ్మెల్యే అన్ని సమ్యసలను తీర్చాలని తెలిపారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షాల వల్ల మల్కెపల్లిలో కల్లాల్లో వరి ధాన్యం మొత్తం మునిగిన రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు పెద్దపల్లి శంకర్, మల్కెపల్లి గ్రామ నాయకులు పడగల మహేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మెస్రం తిరుపతి, మండల కోశాధికారి రత్నం కృష్ణ, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి వెడ్మ శ్రీను పాల్గొన్నారు.

రిమ్స్ వద్ద అంబేద్కర్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని రిమ్స్ ఎదుట గల అంబేద్కర్ విగ్రహాన్ని మాతరమాబాయి మహిళ మండల్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. బుధవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం బౌద్ధ వందన సమర్పించారు. ఈ సందర్భంగా మాతరమాబాయి అంబేద్కర్ మహిళ మండల్ అధ్యక్షురాలు శోభతాయి తుల్జాపూరే మాట్లాడుతూ రిమ్స్ ఎదుట ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం బిల్లులు రాలేదని ఆవిష్కరించలేదన్నారు. మహిళ సంఘం ఆధ్వర్యంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా విగ్రహాన్ని ప్రారంభించామన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని అనుసరిస్తు ప్రతి ఒక్కరు తమ హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుంటు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మహిళ మండల్ ప్రధాన కార్యదర్శి బేబిబాయి కానిందే, పట్టణ కార్యదర్శి సులోచన, రాంబాయి పాల్గొన్నారు.

మొరం వేయించిన సామాజిక కార్యకర్త మౌనిష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు మొలిచి చుట్టూ పక్కల నివసించే వారు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. అలాగే రోడ్లు గుంతలుగా మారడంతో ప్రయాణికులకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయం సామజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి దృష్టికి కాలనీ వాసులు తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన బుధవారం బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా పిచ్చిమొక్కలు తొలగించారు. అలాగే రోడ్డు చదును చేయించి మొరం వేయించారు. దీంతో కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు కిరువైపులా పిచ్చిమొక్కల తొలగింపు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న హైవే రహదారి ఇరు వైపులా పెరిగిన పిచ్చి మొక్కలను బుధవారం గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ అశోక్ కార్మికులతో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చెత్తను నిల్వ ఉంచకుండా గ్రామపంచాయతీ కార్మికులు ఎప్పటికప్పుడు తొలగిస్తూనే ఉన్నారన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-బోథ్



మండలంలోని దన్నూర్-బి, నాగపూర్ గ్రామ సమీప అటవీప్రాంతంలో చిరుత పులి సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్ఓ నాగోరావ్ అన్నారు. నాగపూర్ గ్రామంలో రెండు రోజుల నుంచి కుక్కలు కనిపించకపోవడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చి అటవీ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం అటవీశాఖ అధికారులు అటవీ ప్రాంతంలో పాదముద్రలు సేకరించారు. అవి చిరుత పులి పాద ముద్రలు అని గుర్తించారు. దీంతో ప్రజలు పొలానికి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

నాలుగు రోజులు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

నవతెలంగాణ-బోథ్

వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉన్న పొచ్చెర సాయిబాబా జిన్నింగ్, నేరడిగొండలోని దర్శనం జిన్నింగ్‌లలో నాలుగు రోజులు పత్తి కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్తి సాగు చేస్తున్న రైతులు గమనించి ఈ నెల 12 నుంచి 15 వరకు పత్తిని తీసుకురావద్దని తెలిపారు. సిసిఐ కొనుగోళ్ల కేంద్రాల్లో పత్తి నిల్వ అధికంగా ఉన్నందున తాత్కాలికంగా కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి 16న సోమవారం నుండి కొనుగోళ్ల చేపడతామని పేర్కొన్నారు.